క్లుప్తంగా

ఆలయానికి రూ.3 లక్షల విరాళం



మక్తల్: పట్టణంలోని బీసీ కాలనీలో నిర్మించ నున్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి శిల్పి పాండుకు శుక్రవారం అఖిల పక్షం పార్టీలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో రూ.3 లక్షలు విరాళం అందజేశారు. గుడి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ చేతనైన సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

మాగనూర్: మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనంను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గండిని పూడ్చండి



మాగనూర్: మండల పరిధిలోని పెగడబండ గ్రామ సమీపంలో గత కొన్ని రోజులుగా సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి లోలెవల్ కెనాల్‌కు గండి పడి సాగు నీరు మొత్తం వృథాగా పోతుందని రైతులు వాపోతున్నారు. ఈ ప్రాంతానికి వర్షాకాలంలో కెనాల్ ద్వారా మాత్రమే సాగునీరు అందుతుందని ఇలా కోతకు గురైతే వచ్చే కొన్ని సాగునీరు కూడా లభించే పరిస్థితి ఉండదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కెనాల్‌కు మరమ్మతు చేపట్టి రైతులకు సాగునీరు అందేలా చూడాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఊట్కూరు: మండలంలోని పులమామిడి గ్రామంలో జ్యోతి మహిళా సంఘం సభ్యురాలు బోగం లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు సంఘం సభ్యులు శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సభ్యురాలు గుండెపోటుతో మృతి చెందడంతో సంఘం సభ్యులు కలిసి ఈ మేరకు నగదు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నసూరయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఎల్లగౌడ్, వీవోఏ మున్నా, నాగేంద్రమ్మ, జ్యోతి, కళమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



మాగనూర్: మండలంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. మాగనూర్ వైపు నుంచి కర్ణాటకకు రెండు టిప్పర్లలలో ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని టిప్పర్ డ్రైవర్లు అలిపురం సిద్దన్న, చంద్రప్పతో పాటు ఓనర్‌లు సలీం అహ్మద్, రాఘవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తప్పిన ప్రమాదం



మాగనూర్: డ్రైవర్ నిద్రమత్తుతో లారీ గుంతలోకి దూసుకెళ్లిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక నుంచి పట్నాకు క్యాబేజీ లోడ్‌తో వెళ్తున్న లారీ వాగు సమీపంలోని రెలింగ్‌ను ఢీకొట్టి గుంతలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు లారీ బోల్తా పడకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. అయితే వాగు సమీపంలో మూలమలుపు ఉండటంతో పాటు అక్కడ ఉన్న బటర్ ఫ్లై లైట్లు పనిచేయకపోవడంతో రోడ్డు సైడ్ కనిపించక నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నానో యూరియా వినియోగిద్దాం

- యూరియా దొరక్క రైతుల తిప్పలు
- గంటల తరబడి క్యూలైన్‌లలో నిరీక్షణ
- నానో యూరియా వినియోగించాలంటున్న అధికారులు



ధన్వాడలో యూరియా కోసం బారులు తీరిన రైతులు (ఫైల్)

ధన్వాడ: పంటలు సాగు చేసి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ రైతులకు సరిపడా యూరియా అందడం లేదు. క్షేత్రస్థాయిలో యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నా రైతులు మాత్రం నానో యూరియాపై ఆసక్తి చూపడం లేదు. నానో యూరియాతో పంటలో ఎదుగుదల లోపిస్తుందని అపోహ పడడంలో ఎటువంటి నిజం లేదని నానో యూరియాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఇప్పటికి 6738 యూరియా బ్యాగుల పంపిణీ

ధన్వాడ సింగిల్ విండో పరిధిలో గత నెల 14వ తేదీ నుంచి యూరియా బ్యాగుల పంపిణీ ప్రారంభించారు. ఇప్పటి వరకు 6738 బ్యాగులను రైతులకు పంపిణీ చేశారు. ఒకరికి రెండు బ్యాగుల చొప్పున యూరియా బ్యాగులను అందజేస్తున్నారు. రెండు ఎకరాలకు మూడు బ్యాగుల యూరియా వేయల్సి వస్తుందని రెండు బ్యాగులు ఇస్తే తమకు ఎక్కడ సరిపోతుందని రైతులు వాపోతున్నారు. చాలా మంది రైతులు తమకు ఉన్న భూమితో పాటు ఇతరుల పొలాలను సైతం కౌలుకు తీసుకొని వరి సాగు చేపట్టారు. ఇప్పుడు వాటికి సరిపడా యూరియా లేకపోవడంతో పంట చెమ్మగిల్లి ఎండిపోతుందని ఆందోళన చెందుతున్నారు.

13,600 వరి ఎకరాల్లో సాగు..

మండలంలో రైతులు సుమారు 13,600 ఎకరాల్లో వరి పంటలు సాగు చేశారు. అలాగే పత్తి 7,600 ఎకరాల్లో కందులు 1500 ఎకరాల్లో, జొన్న 1110 ఎకరాల్లో సాగు చేశారు. వరి పంటలు వేసి 40 నుంచి 60 రోజులు కావస్తుంది. యూరియా కొరత నేపథ్యంలో పంపిణీ కేంద్రాల్లో ఒక్కో రైతుకు రెండు బస్తాల యూరియా మాత్రమే అందజేస్తున్నారు. 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు యూరియా సరిపోక పంటలు ఎదిగే సమయంలో యూరియా లేకపోతే పంటల ఎదుగుదల తగ్గి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **నానో యూరియా వాడాలి**
>
> రైతులు సాధారణ యూరియానే ఎక్కువగా ఆధారపడుతున్నారు. సాధారణ యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగిస్తే వేచి ఉండాల్సిన తిప్పలు తప్పుతాయి. యూరియా బస్తా రూ.266గా ఉంది. అదే నానో యూరియా 250 మి.లీ రూ.150 నుంచి రూ.200 వరకు దొరుకుతుంది. నానో యూరియాపైన ఉన్న అపోహలను వీడి పంటలపైన నానో యూరియాను ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
>
> –నవీన్‌కుమార్, ఏఓ, ధన్వాడ

ఇంకెన్నాళ్లు యూరియా కష్టాలు



మరికల్‌లో యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

మరికల్: రైతులను యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. శుక్రవారం మరికల్‌లో మన గ్రోమోర్ కేంద్రానికి 280 బస్తాల యూరియా రావడంతో అధికారులు రెండు రోజుల కితం టోకెన్లు పొందిన రైతులను క్యూ లైన్‌లో నిలబెట్టి ఒక్కొక్క రైతుకు రెండు బస్తాల యూరియా అందజేశారు. గంటల తరబడి లైన్‌లో నిలబడితే రెండు బస్తాల యూరియా పంపిణీ చేయడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో రైతులందరికీ సరిపడా యూరియాను తెప్పించి పంపిణీ చేస్తామని ఏఓ రహ్మాన్ తెలిపారు.

వర్షంలోనూ బారులు తీరిన రైతులు

ధన్వాడ: మండలకేంద్రంలోని రైతులు యూరియా కోసం వర్షంలోనూ బారులు తీరారు. ఫర్టిలైజర్ షాపుల ముందు క్యూలో నిలబడి అవస్థలు పడ్డారు. ఒక వైపు వర్షం పడుతున్నా అలాగే తడుచుకుంటూ యూరియాను తీసుకెళ్లారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

ఊట్కూరు: ప్రభుత్వం యూరియా సమస్యను పరిష్కరించాలని సీపీఎం రైతు సంఘం నాయకులు జోగు శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని నిడుగుర్తి గ్రామంలో రైతులతో కలిసి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నానోయూరియాను ప్రమోట్ చేయాలనే ఉద్దేశంతో గ్రామేల్స్ యూరియాకు బడ్జెట్ తగ్గించిందని దీంతో యూరియా కొరత ఏర్పడిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాల అంజప్ప, వెంకటప్ప, కుర్వ సిద్దప్ప, రాంరాజ్, కుర్మప్ప పాల్గొన్నారు.



నిడుగుర్తిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చెట్లే ప్రగతికి జీవనాధారం



మరికల్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, నాయకులు

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ నాగమణిమాల, కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డి, అఖిలపక్షం పార్టీల నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు హరీష్, కృష్ణయ్య, వేణు, రాజు, చెన్నయ్య, రమేష్, విజయ్, మొగులప్ప, శివ, వెంకటేష్, రఘు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

కొత్తపల్లి: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆవరణలో శుక్రవారం అధికారులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎంపీడీఓ కృష్ణారావ్ మాట్లాడుతూ విద్యార్థులు అమ్మనాన్నల పేరు మీద మొక్కలు నాటాలన్నారు. చెట్లు లేకుంటే ప్రాణకోటికి జీవనాధారం లేదని, చెట్లను పెంచితే ప్రాణా వాయువు లభించడంతో పాటు వాతావరణ విపత్తుల నుంచి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

మాగనూర్: ప్రతి ఒక్కరు తమ పేరు మీద ఒక మొక్క నాటి సంరక్షించాలని నేరడగం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతాలక్ష్మి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ఏక్ పేడ్ మాకే నామ్ పర్' లో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు సురేష్, నారాయణమ్మ, హారిక, విద్యార్థులు పాల్గొన్నారు.

37వ రోజుకు రిలే దీక్షలు



దామరగిద్ద: పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాన్‌కుర్తి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 37వ రోజుకు చేరుకున్నాయి. మార్కెట్ విలువ ప్రకారం తమకు పరిహారం అందించే విషయమై అధికారికంగా స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు రైతుల పోరాటానికి మద్దతుగా ఉంటామని భూ నిర్వాసిత సంఘం నాయకులు అన్నారు. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇస్తున్నట్లు సమాచారం అందడంతో నిర్వాసిత సంఘం నాయకులతో ఎమ్మెల్యే సమక్షంలో చర్చలకు పిలుస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం నుంచి అధికారులు రైతులను ఒప్పించి సర్వే చేపట్టనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో రైతులు రమేష్, రాజు, వెంకటేష్, శ్రీనివాస్, నరేష్‌లు దీక్షలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలి

మక్తల్: పట్టణంలోని 16వ వార్డులో ఎక్కడ చూసిన చెత్త పేరుకుపోయిందని పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని మాజీ కౌన్సిలర్ అనంపల్లి కొండయ్య కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలు చెత్తతో నిండి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోనేరు పనులకు మున్సిపల్ వాహనాలను వాడుకుంటుంటడం వల్ల కాలనీల్లో మురుగు సమస్య తీవ్రతరం అవుతుందన్నారు. ఇప్పటికైనా కమిషనర్ దృష్టి సారించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని విన్నవించారు.

రాజీమార్గమే రాజమార్గం



కొత్తపల్లి: కక్షిదారులు కేసులకు పోకుండా రాజీ మార్గం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని చీఫ్ లీగల్ హెడ్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతి గౌడ్ అన్నారు. కొత్తపల్లి తండాలో శుక్రవారం నిర్వహించిన న్యాయ సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే ఈనెల 13న కోస్గి కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న చిన్న తగాదాలను గ్రామంలోనే గ్రామ పెద్దల సమక్షంలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో ఏమైనా పెండింగ్ కేసులు ఉంటే కోర్టుల చుట్టూ తిరగకుండా శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావ్, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ఊట్కూరు: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం రెండో విడత దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాధవి మాట్లాడుతూ పాఠశాల పీఎం శ్రీకు ఎంపిక కాబడడంతో విద్యార్థులకు ఉచితంగా దుస్తువులు, పుస్తకాలు, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేమకుమారి, పారిజాత, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీ



మద్దూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మద్దూరు: పట్టణంలో శుక్రవారం మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక జమా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం పాతబస్టాండ్ మీదుగా ఎస్‌బీఐ రోడ్డు, కొత్తబస్టాండ్‌లోని మజీద్ వరకు ర్యాలీ కొనసాగింది. గత వారంలో నిర్వహించాల్సిన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఉన్నందున శుక్రవారం నిర్వహించినట్లు తెలిపారు.

ముస్లింల భారీ ర్యాలీ

ధన్వాడ: మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. పెద్ద మసీదు నుంచి ర్యాలీ ప్రారంభించి గ్రామ పురవీధుల గుండా కంచుకోట వీధి సంత బజార్ బస్టాండ్ శ్రీరామ్ నగర్ వీధి మీదుగా మసీదుకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మజీద్ కమిటి అధ్యక్షులు ఇక్బాల్ ఖాన్ నాయకులు రెహమాన్‌ఖాన్, రఫీ యుద్దీన్, గఫూర్‌సబ్, ఇమాన్ సాబ్, అబ్దుల్‌నబీ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



నర్వ: బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉమెన్, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ నర్సింములు అన్నారు. శుక్రవారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు పాఠశాలకు విద్యార్థులు నిత్యం గైర్హాజరవడంపై వస్తున్న ఫిర్యాదులపై గ్రామంలో జీహెచ్‌ఎం భాగ్యలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి అర్జున్‌తో కలిసి విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి 16 మంది విద్యార్థులను పాఠశాలకు తీసుకొచ్చారు. విద్యార్థులు డ్రాపౌట్ కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ బాలరాజు, సీఆర్పీ నర్సిములు, ఉపాధ్యాయులు తదతరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



నారాయణపేట రూరల్: మండల పరిధిలోని కోటకొండ గ్రామంలో శుక్రవారం సీపీఎం పార్టీ మాజీ కార్యదర్శి సీతారామ ఏచూరి ప్రథమ వర్ధంతిని సందర్భంగా నివాళి అర్పించారు. అనంతరం పార్టీ గ్రామ కార్యదర్శి గుండెగారి దస్తప్ప మాట్లాడుతూ లౌకిక విలువలు, భారత రాజ్యాంగ రక్షణ కోసం ఊపిరి ఉన్నంతవరకు పోరాటం చేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మల్లేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కృష్ణా: మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న పద్మకు మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు రావడంతో శుక్రవారం తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగ ఎస్‌ఓ షాలిని మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఎంతో బాధ్యతతో పనిచేశారని ఆమె సేవలను కొనియాడారు. సీఆర్‌పీ అమీన్‌రెడ్డి, తోటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేద్దాం

నారాయణపేట రూరల్: లోకాయపల్లి లక్ష్మమ్మ మాతా దేవాలయ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని కమిటీ గౌరవ అధ్యక్షులు హరినారాయణ్ బట్టడ్ అన్నారు. స్థానిక ఆలయంలో శుక్రవారం కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ మాస ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. భక్తుల సౌకర్యార్థం చేపట్టిన చర్యలతో జరిగిన లాభ, నష్టాలపై సభ్యుల అభిప్రాయాలు తీసుకున్నారు. అదేవిధంగా నెలలో వచ్చిన హుండీ ఆదాయం లెక్కించారు. రూ. 9.76 లక్షల ఆదాయం వచ్చినట్లు కోశాధికారి లప్ప అశోక్ తెలియచేశారు. రూ. 4.51 లక్షలు ఖర్చు చేయగా రూ. 5.24 లక్షలు మిగిలినట్లు వివరించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ కోట ఆంజనేయస్వామి శిఖర నిర్మాణ పనులపై కార్యదర్శి వేముల మధుసూదన్ రెడ్డి వివరించారు. సమావేశంలో సభ్యులు చంద్రశేఖర్, నర్సింలు, ఆత్మారామ్, సంతోష్, రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరహరి పాల్గొన్నారు.



మండల అభివృద్ధికి తోడ్పాటు అందించండి



ఎంపీ డీకే అరుణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు

ఆత్మకూర్: మండలంలోని గ్రామాల్లో విద్యా, వైద్యం, రవాణా సౌకర్యం, రోడ్ల మరమ్మతులు, వీధిదీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలంటూ ఎంపీ డీకే అరుణను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి విన్నవించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో కలిసి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ నిధులతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, త్వరలోనే మండలంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్టు తెలిపారు. అలాగే ఈనెల 17న ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని దిశా నిర్దేశం చేశారని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో అచ్చం పేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కంభాళాపురం రాము, మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్వ: సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ అన్నారు. శుక్రవారం జంగంరెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు దాదాపు రూ. 8.79 లక్షల విలువైన చెక్కులు, ఎల్‌ఓసీలను అందించారు. సోనికి రూ. లక్ష, భారతికి రూ.లక్ష, జంగంరెడ్డిపల్లి దేవేంద్రమ్మకు రూ.60 వేలు, రంగమ్మకు రూ.60 వేలు, అచ్యుతారెడ్డికి రూ.4 లక్షల ఎల్‌ఓసీ, కన్మనూర్ గ్రామానికి చెందిన భాగ్యమ్మకు రూ.99 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ టీచర్లను నియమించాలి

నారాయణపేట రూరల్: జిల్లాలోని ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో సోషల్ టీచర్ల నియామకం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకుడు కష్టప్ప డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మార్వోలో వినతిపత్రం అందజేశారు. పిల్లల మానసిక స్థితిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆటిజం , మానసిక వైకల్యం, సెరిబ్రల్ పాల్సి, వినికిడి లోపం, అభ్యాసన వైకల్యాలు, ప్రవర్తనలో మార్పు, భావోద్వేక వైకల్యం, ఇంద్రియ లోపాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన వైద్యులు, పీడియాట్రిషియాన్స్, స్పీచ్, లాంగ్వేజ్ తెరఫీ, తదితర కౌన్సిలర్లను నియమించే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో నరసప్ప, బలరాం, వెంకటమ్మ, దస్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ టీచర్లగా అవకాశం కల్పించాలి

మాగనూర్: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో స్పెషల్ టీచర్లను నియమించాలని దివ్యాంగులు ఎంఈవో మురళీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో స్పెషల్ టీచర్లను నియమించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల్లో లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వీరిలో అనేక మంది పలు వైకల్యాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరిని చూసేందుకు డెవలప్మెంట్ పీడియాట్రీసియన్స్, స్పీచ్, లాంగ్వేజ్ తెరపిస్టులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు.

పీఎస్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలి

నర్వ: ఎస్సీ ధృవీకరణ పత్రంతో ఉద్యోగం పొందిన ఏడుకొండలును ఉద్యోగం నుంచి తొలగించాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గుడిసె వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నర్వ తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ సంఘం, ఎంఎస్పీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. యాంకి గ్రామానికి చెందిన డి.ఏడుకొండలు జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఉద్యోగానికి బీసీ అయి ఉండి ఎస్సీ ధృవీకరణ పత్రంతో తప్పుడు పద్ధతిలో ఉద్యోగం సాధించాడన్నారు. ఏడుకొండలుకు తప్పుడు సర్టిఫికెట్స్ జారీ చేసిన అప్పటి తహసీల్దార్‌ను సస్పెండ్ చేసి అతనిని ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శరణప్ప, పెద్దింటి ఆంజనేయులు, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు నివేదిక అందజేత

మండలంలోని యాంకి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్పుడు కుల ధృవీకరణ పత్రం ద్వారా పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం పొందడంపై ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టినట్లు తహసీల్దార్ మల్లారెడ్డి అన్నారు. విచారణ అనంతరం నివేదికను ఆర్డీఓకు అందించినట్లు తెలిపారు. 2019లో ఎస్సీ కుల ధృవీకరణ పత్రం కోసం కార్యాలయానికి రాగా విచారణలో బీసీ కులానికి చెందిన వారని తెలియడంతో ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించామన్నారు. జిల్లాలో ఎక్కడ మాదాసి మాదారి కుర్వ కులానికి ఎస్సీ సర్టిఫికెట్స్ ఇవ్వలేదన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నీలిమవర్దిని

కోస్గి రూరల్: ప్రపంచాన్ని పరిశోధించడానికి శాస్త్రీయ అన్వేషణ అద్భుతమైన అవకాశమని పీయంశ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నీలిమ వర్దిని అన్నారు. మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ జిల్లా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలోని పీయం శ్రీ మోడల్ స్కూల్‌లో 10 రోజుల ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలతో మరిన్ని ప్రయోగాలు చేయాలని సూచించారు. విద్యార్థులు చేపట్టిన కృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. మహిళా సాధికారిత కో ఆర్డినేటర్ నర్సింములు మాట్లాడుతూ సైన్స్‌ఫేర్ లాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు అనిత, నరసింహ, కళాశాల అధ్యాపకులు శ్రీహరి, ముఖేష్ ,రాజేశ్వరి, మాధవ్ , శేషవులు తదితరులు పాల్గొన్నారు.